వర్షాకాలం.. పశువులు భద్రం

- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం
- నిర్లక్ష్యం వహిస్తే జీవాల ప్రాణాలకే ప్రమాదం
- 1962కు ఫోన్ చేస్తే ఇంటి వద్దకే వైద్యం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



పెసరవాయిలో ఆవుకు టీకా వేస్తున్న వైద్యుడు

గడివేముల: వర్షాకాలంలో పశువుల్లో వ్యాధులు ప్రబలే అవకాశం అధికం. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు సాధారణమైనవే అయినా పాడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పాడిరైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వాటి ప్రాణాలకే ప్రమాదం వాటిళ్ల వచ్చు. పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకం దార్లు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు సూచి స్తున్నారు. జీవాలు ప్రమాదకర పరిస్థితిలో ఉంటే వెంటనే 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో వైద్యులే ఇంటికి వచ్చి మరీ చికిత్స అందిస్తారు.

గాలికుంటు వ్యాధి

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలకు ఎక్కువగా సోకుతాయి. వ్యాధి బారిన పడిన పశువు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగ్గా తీసుకోలేవు. దీంతో నీరసంగా మారి నడిచేందుకు కష్టపడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యులు సూచన మేరకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

నట్టల వ్యాధితో ఎదుగుదలకు బ్రేక్

పశువులు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో వాటి ఎదుగుదలకు అవకాశం ఉండదు. జీవాలు తిన్న ఆహారమంతా నులి పురుగులే స్వాహా చేస్తాయి. దీంతో జీవాలు తరచూ రోగాల బారినపడే అవకాశం ఉంటుంది. ఎక్కువగా గొర్రెలు ఈ వ్యాధి బారిన పడతాయి. ఎందుకంటే వర్షాలు పడి అక్కడక్కడ పెరిగే పచ్చి మేతను తిన్నప్పుడు ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఆరు నెలలకోసారి పశువులకు నట్టల నివారణ మందులు ఉచితంగా అందిస్తోంది. ఈ ఏడాది కూడా నట్టల నివారణ మందులు సకాలంలోనే వేశారు.

కలుషిత నీటితో జలగ వ్యాధి

మురుగునీరు, కాల్వల్లోని కలుషిత నీరు తాగడం వల్ల పశువులకు ఎక్కువగా ఈ వ్యాధి సోకుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. మేత తినడంలో పశువులు బాగా ఇబ్బంది పడతాయి. పాల దిగుబడీ క్షీణిస్తుంది. జలగ వ్యాధి బారిన పడకుండా పశువులకు మంద నుంచి వేరు చేయాలి. డిస్టోడిన్ 4 మాత్రలు, 100 మిల్లీ లీటర్ల నీయోజెడ్ ప్లస్‌ను అందించాలి.

చిటుకు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా వచ్చే వ్యాధుల్లో చిటుకు ఒకటి. ఇది సోకినప్పుడు జ్వరం ఎక్కువగా ఉంటుంది. నివారణ కోసం జూలై, ఆగస్టు మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు పశువులకు సంబంధించి వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందించడం వల్ల వాటిని నివారించవచ్చు.

గొంతువాపు.. ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైంది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ కారుతుంది. శ్వాస పీల్చడానికి ఇబ్బంది పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు హెచ్‌ఎస్ టీకాలు వేస్తారు. వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.

గడివేముల మండలంలో పశుసంపద	
తెల్లవి	-5310
నల్లవి	-8245
గొర్రెలు	-18424
మేకలు	-8865

సకాలంలో చికిత్స చేయించాలి



పశువుల అనారోగ్యాన్ని గుర్తించిన వెంటనే సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో పశువులకు కాలానుగుణ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. ఏదైనా వ్యాక్సిన్ వేయిస్తే దాని ప్రభావం ఆరు నెలల వరకు ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆరు నెలలకోసారి వేస్తాం. గొంతువాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. పశు సంరక్షణపై ఎలాంటి సందేహాలున్నా పాడి రైతులు స్థానిక పశు వైద్య కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించవచ్చు.

–డాక్టర్ సాయి హరిణి,
వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, గడివేముల

గిరిజన భూములను కాపాడాలని వినతి



జేసీ మౌర్యకు వినతి పత్రం సమర్పిస్తున్న గిరిజనులు

ఓర్వకల్లు: మండలంలోని బ్రాహ్మణపల్లె మజారా గ్రామమైన గుమ్మితం తండాకు చెందిన గిరిజన భూములను కాపాడాలని స్థానికులు జేసీ నారపురెడ్డి మౌర్యకు విన్నవించారు. శుక్రవారం బాధిత రైతులు జేసీ మౌర్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని సుమారు 100 ఎకరాలను 70 ఏళ్ల నుంచి సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని.. ప్రస్తుతం ఈ భూములను అటవీ శాఖకు చెందినవిగా గుర్తించి లాక్కోవాలని చూస్తున్నట్లు వాపోయారు. తమ వద్ద భూములకు సంబంధించి పట్టాదారు పుస్తకాలు, అడంగల్, 1బీ రికార్డులు ఉన్నాయని తెలిపారు. దశాబ్దాల నుంచి సాగు చేసుకుంటున్న భూములను టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఆక్రమిత భూములని ప్రచారం చేస్తూ అటవీ శాఖకు అప్పగించాలని నోటీసులు జారీ చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన జేసీ మౌర్య భూములకు సంబంధించిన సమగ్ర నివేదిక సమర్పించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

క్లోరినేషన్ తప్పనిసరి



వర్కూరులో ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్

కోడుమూరు రూరల్: ప్రతి రోజు క్లోరినేషన్ చేసిన తర్వాతనే కొళాయిల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని వర్కూరు గ్రామాన్ని సందర్శించారు. మంచినీటిని సరఫరా చేసే బోర్లు, ట్యాంకును పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రతి 15రోజులకోసారి ట్యాంకును తప్పనిసరిగా శుభ్రపరచాలని, నీటి పైపు లైన్లకు లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి రోజు క్లోరినేషన్ చేసిన తర్వాతనే ప్రజలకు నీటిని విడుదల చేయాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు



పోలకల్ స్కూల్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ ఆదామ్‌బాషా

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎంఈఓ ఆదామ్‌బాషా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోలకల్ రెగ్యులర్ పాఠశాలను తనిఖీ చేశారు. ఉదయం ప్రార్థన సమయానికే పాఠశాలకు చేరుకున్న ఎంఈఓ ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు,వసతులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను తెలియజేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ.. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యా బోధన ఉంటుందని తెలిపారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు మంచి పునాది పడుతుందని చెప్పారు. హెచ్‌ఎం రేవుల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన కిరణ్

పాణ్యం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై దొంగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్లు హైవే సిబ్బంది శుక్రవారం తెలిపారు.వివరాలు.. పోలూరుకు చెందిన కిరణ్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న లారీ సడన్‌గా స్లో కావడంతో ఢీకొన్నాడు. కిరణ్‌కు గాయాలు కావడంతో పాణ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి మంజుల వాణి

గడివేముల: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఈఓఆర్డీ అబ్దుల్ ఖాలిక్ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఖాలిక్ 38 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఎక్కడా మచ్చలేకుండా నీతీనిజాయితీగా పనిచేశారని కొనియాడారు. పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులతో, నాయకులతో స్నేహభావంతో మెరిగారని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.బీ చంద్ర శేఖరరెడ్డి అన్నారు. అనంతరం ఎంపీపీ నాగమద్దమ్మ, ఎంపీడీఓ శివరామిరెడ్డి, తహసీల్దార్ జమానుల్లా ఖాన్, పంచాయతీ కార్యదర్శులు ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు అస్వస్థత

పాణ్యం: నంద్యాల సమీపంలోని ఓ ఫార్మసీ కళాశాల ల్యాబ్‌లో శుక్రవారం ప్రయోగాలు చేస్తుండగా కెమికల్ రియాక్షన్ జరిగింది. ఒక్కసారిగా పొగలు వ్యాపించడంతో ఆరుగురు విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. అప్రమత్తమైన కళాశాల సిబ్బంది హుటాహుటిన వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. జరిగిన ఘటనపై కళాశాల యాజమాన్యం ల్యాబ్ టెక్నీషియన్‌ను వివరణ కోరింది.

మాజీ సర్పంచ్ మృతి



మద్దిలేటి (ఫైల్)

కల్లూరు: మండల పరిధిలోని తడకనపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మద్దిలేటి(55) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని గ్రామస్తులు తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- 8 మంది ఉత్తరాది వ్యక్తులకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందిన బెంగాల్‌వాసులు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామ సమీపంలో ఉన్న పుట్టగొడుగుల పరిశ్రమలో శుక్రవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుట్టగొడుగుల పరిశ్రమలో ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన వంద మంది వలసకూలీలు పనిచేస్తున్నారు. వీరంతా అక్కడే పరిశ్రమవారు కేటాయించిన రేకుల షెడ్లలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు మహిళలు బట్టలు ఉతుకుతుండగా పక్క గదిలో ఉన్న పశ్చిమబెంగాల్‌కు చెందిన యువకులు స్నానం చేయడానికి వెళ్లారు. బట్టలు ఉతుకుతున్న వారిని లోపలికి వెళ్లమని చెప్పారు. అందుకు సదరు మహిళలు నిరాకరించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గమనించిన వారి బంధువులు ఘర్షణకు దిగారు. ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 8 మందికి గాయాలయ్యాయి. పరిశ్రమ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను కంపెనీ వాహనాల్లో ఓర్వకల్లు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వెళ్లిపోయారు. కాగా, జరిగిన ఘటనపై ఇరువర్గాల వారు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు

- జిల్లా వనరుల కేంద్రం ఏఓ మాధురి



నూనెగింజల యాజమాన్యంపై రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయ అధికారులు

కల్లూరు: రైతులు పంట సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎ.మాధురి రైతులకు సూచించారు. శుక్రవారం కల్లూరు మండలం కొంగనపాడు గ్రామంలోని ఆర్‌బీకేలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో మొక్కజొన్న, నూనెగింజల యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. నూనెగింజల పంట సాగులో వ్యవసాయ అధికారులు సూచనలు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. భూమిలో సేంద్రియ కర్బనం పెరగడానికి పచ్చిరొట్ట ఎరువులు, ఫామ్ యార్డ్ మాన్యుర్ (ఎఫ్‌వైఎం) వాడాలని ఏఓ శ్రీనివాసరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శ్రీలత అన్నారు.

ల్యాప్‌టాప్ దొంగ దొరికాడు

- చోరీ కేసును ఛేదించిన పోలీసులు



నిందితుడు హెబ్నేజర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య విద్యార్థి ల్యాప్‌టాప్‌ను చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఓ వైద్య విద్యార్థి ల్యాప్‌టాప్‌ను గురువారం వ్యక్తి తస్కరించాడు. ఈ మేరకు సదరు వైద్య విద్యార్థి మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఆసుపత్రికి వచ్చి విచారణ చేశారు. ఆసుపత్రిలోని సీసీ టీవీ ఫుటేజీను పరిశీలించి దొంగను గుర్తించారు. అతను ముఖానికి ముసుగు ధరించి క్యాజువాలిటీకి వచ్చి ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్‌ను చోరీ చేసినట్లు గమనించారు. ఈ మేరకు అతను స్థానిక బుధవారపేటకు చెందిన హెబ్నేజర్‌గా గుర్తించి శుక్రవారం అదుపులో తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక నిఘా ఉంచాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్ ప్రతిరోజూ మూడు షిఫ్టులలో రౌండ్స్ నిర్వహించేలా చూసుకోవాలని చెప్పారు. పోలీసులు ఆసుపత్రిలో రెక్కీ నిర్వహించాలని పోలీస్ ఉన్నతాధికారులను కోరినట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు సైతం వారి వస్తువులు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రిలో అడుగడుగునా కెమెరాల నిఘా ఉంచామని పేర్కొన్నారు.

వానల్లేక ఎండుతున్న పంటలు



కోడుమూరులో ఎండుముఖం పట్టిన కొర్ర పంట

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో భారీ వర్షాలు కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. మండలంలో సుమారు 3,800 ఎకరాల్లో కొర్ర, సజ్జ, కంది, పత్తి తదితర పంటలను సాగు చేశారు. ఈనెల 12వ తేదీ కురిసిన మోస్తరు వర్షం తప్ప మళ్లీ వానలు కురవలేదు. దీంతో రైతులు సాగు చేసిన పంటలన్నీ ఎండుముఖం పడుతున్నాయి. చిరుజల్లులు తప్ప భారీ వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో నాలుగైదు రోజుల్లో వానలు పడకకంటే పంటలే దెబ్బతినే ప్రమాదముందని వాపోతున్నారు.

మైనారిటీ బాలికల హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాసులు

కర్నూలు(అర్బన్): నగరంలోని గడియారం ఆసుపత్రి సమీపంలో ప్రభుత్వ ఉర్దూ బాలుర పాఠశాల ఆవరణలో ఉన్న మైనారిటీ బాలికల హాస్టల్‌లో ప్రవేశం పొందాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సునీల్‌కన్నా శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2024–25 విద్యా సంవత్సరానికి 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హత, ఆసక్తి కలిగిన 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న మైనారిటీ విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ హాస్టల్‌లో విద్యార్థినులకు వసతితో పాటు ప్రభుత్వ మెనూ ప్రకారం ఉచిత భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రవేశం పొందేందుకు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుంచి బోనోఫైడ్ సర్టిఫికెట్, తహసీల్దార్ నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జతపరచాలన్నారు. మరిన్ని వివరాలకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సెల్: 94916 53323 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

1న ఇంటి వద్దకే పెన్షన్లు

కర్నూలు (టౌన్): వచ్చే నెల ఒకటో తేదీన సచివాలయాల కార్యదర్శులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తారని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉదయం 6 గంటల నుంచే ఈ ప్రకియ ప్రారంభమవుతుందన్నారు. కర్నూలు నగరంలో 26 రకాల పెన్షన్లకు 33,751 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. వీరికి రూ.23,20,41, 500 అందించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి



కొలురులో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

పాణ్యం: ఉపాధి హామీ పథకం ద్వారా చేసే పనుల్లో నాణ్యత ఉండాలని.. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని నంద్యాల కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కొలూరు గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. గ్రామంలోని మేజర్ కెనాల్‌లో పూడికతీత పనులను పరిశీలించారు. గ్రామంలో 71 మంది కూలీలతో వాగులు, కెనాల్‌లో పనులు చేయిస్తున్నామని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో 245 జబ్ కార్డులు ఉండగా 234 మందికి పనులు కల్పించామని తెలిపారు. మూడు నెలలుగా కూలీలకు సరాసరి రేటు రూ. 234 ఉండగా ఈ నెల రూ. 280 వేతనంతో పని చేయిస్తున్నట్లు వెల్లడించారు. ఎస్సీ కుటుంబాల్లో 128 మందికి జాబ్‌కార్డులు ఉండగా 106 మందికి పనులు కల్పించామన్నారు. మేజర్ కెనాల్‌లో రూ. 3.34 లక్షలతో జూన్ రెండో వారం నుంచి పూడికతీత పనులు చేస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యతగా ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. చేసే ప్రతి పని గ్రామస్తులు, రైతులకు ఉపయోగపడాలని సూచించారు. మెట్ట భూముల్లో ఉద్యాన, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఏపీడీ బాలాజీనాయక్, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఏపీఓ విజయరాణి ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



డ్రమ్ములో నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక శరీన్‌నగర్ పరిధిలోని కృష్ణానగర్ సచివాలయంలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని అన్ని గృహాల్లో ఉన్న నీటి తొట్టెలు, కూలర్లు, ఫ్రిడ్జ్‌లు, టైర్లు, పాత బాటిల్స్ వంటి వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా దోమలు మలేరియా, డెంగీ, చికున్‌గున్యా మొదలైన ప్రాణాంతక వ్యాధులను కలగజేస్తాయన్నారు. ప్రజలు ప్రతిరోజూ అన్ని నీటి తొట్టిలోని నీరు తీసివేసి వాటిని శుభ్రపరుచుకుని ఎండబెట్టిన తర్వాత మళ్లీ నీరు నింపుకోవాలని, వాటిపై మూత లేదా వస్త్రాన్ని కప్పి ఉంచాలని సూచించారు. అన్ని గృహాల్లో పారిశుద్ధ్యం పనులు, హైపోక్లోరైడ్ పిచికారీ చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులను ఆదేశించారు. డీసీఎం ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి ఉన్నారు.


జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటండి

కర్నూలు (టౌన్): మహారాష్ట్రలోని పూణేలో ఈనెల 29, 30 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి సీనియర్ పురుషుల రగ్బీ పోటీల్లో సత్తాచాటాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక ఒలింపిక్ సంఘ కార్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర జట్టు క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బాపట్లలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన జిల్లా క్రీడాకారులు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఏపీ జట్టుకు కోచ్‌గా గుంటూరుకు చెందిన సుమంత్, మేనేజర్‌గా కర్నూలుకు చెందిన శ్రీకాంత్, ఫిజియోథెరపిస్టుగా సురేష్ వ్యవహరిస్తారని చెప్పారు.

వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చెప్పారు. నూతన జిల్లా కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనను కలెక్టరేట్‌లో ఏపీ హంస అసోసియేషన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాలన సజావుగా సాగేందుకు ఉద్యోగుల సహకారం చాలా అవసరమన్నారు. ఉద్యోగుల సమస్యలు ఏవైనా సరే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ హంస అసోసియేషన్ జిల్లా చైర్మన్ రఘుబాబు, సిటీ చైర్మన్ గోవిందు, నాయకులు కరుణానిధి, మద్దూరి వెంకటస్వామి, మాలిక్‌బాషా, కె. సందీప్, త్యాగరాజు తదితరులు ఉన్నారు.

పరిసరాల శుభ్రత.. సామాజిక బాధ్యత



కొత్తకోటలో దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న ఈఓఆర్డీ

సి.బెళగల్: పరిసరాల పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛ గ్రామానికి సహకరించాలని కోరారు. పరిసరాల శుభ్రతతో వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. వీధుల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు. ఆయన వెంట కొత్తకోట సర్పంచ్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.